క్లుప్తంగా

ఇంటర్ స్పాట్ అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

పర్వతగిరి : పర్వతగిరి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఇంటర్మీడియట్ ఎంఎల్‌టీ కోర్సులో మిగిలిన సీట్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు స్పెషల్ ఆఫీసర్ నాజియా సల్మా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతిలో పాసైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకునే విద్యార్థులు ఈనెల 23న సర్టిఫికెట్లతో నేరుగా స్థానిక కస్తూర్బాగాంధీ పాఠశాలకు రావాలని కోరారు.

గెస్ట్ లెక్చరర్‌కు..

వర్ధన్నపేట : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న కంప్యూటర్ సైన్స్ సబ్జెక్ట్ విభాగంలో గెస్ట్ లెక్చరర్ నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ పోచయ్య మంగళవారం తెలిపారు. అభ్యర్థులు సంబంధిత సబ్జెక్ట్ పీజీలో 55 శాతం మార్కులు, ఎస్సీ, ఎస్టీలకు 50 శాతం మార్కులు, కనీస అర్హత పీహెచ్‌డీ, నెట్/సెట్ గల అభ్యర్థులకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. బయోమెట్రిక్ పనిగంటల ఆధారంగా గౌరవ వేతనం ఉంటుందని వివరించారు. ఆసక్తి గల అభ్యర్థులకు ఈనెల 24 వరకు కళాశాల ప్రాంగణంలో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. ఇంటర్వ్యూ తేదీ వివరాలు త్వరలోనే తెలియజేస్తామని పేర్కొన్నారు.

మెనూ పాటించాలి

ఖానాపురం : మోడల్ స్కూల్ హాస్టల్ నిర్వహణ అస్తవ్యస్తంగా ఉందని, నిబంధనల ప్రకారం మెనూ పాటించకపోవడం బాధాకరమని ఏబీవీపీ తెలంగాణ ప్రాంత హాస్టల్స్ కన్వీనర్ వేల్పుల రాజ్‌కుమార్ అన్నారు. మండలంలోని బుధరావుపేట హాస్టల్‌ను ఏబీవీపీ బాధ్యులు మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శుభ్రంగా లేని కూరగాయలు, గదులు దర్శనమిచ్చాయన్నారు. జిల్లా కన్వీనర్ శ్రవణ్, గణేష్, సిద్ధు, చరణ్, గౌతం, తదితరులు పాల్గొన్నారు.

నర్సంపేటకు షీ టీం శాఖ కేటాయింపు



ఎస్సైని శాలువాతో సత్కరిస్తున్న బీసీ పవర్ నాయకులు

నర్సంపేట : పట్టణంలో నూతనంగా ఏర్పాటైన షీ టీమ్ పోలీస్ స్టేషన్‌లో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్సై స్వాతిని మంగళవారం బీసీ పవర్ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు వరంగంటి కవిత మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బీసీ పవర్ రాష్ట్ర అధ్యక్షుడు, అధికార ప్రతినిధి ఆబోతు రాజుయాదవ్, మచ్చిక రాజుగౌడ్‌లు మాట్లాడుతూ నర్సంపేటలో ఉన్న ఇంజనీరింగ్, డిగ్రీ, జూనియర్ కాలేజీలు, మెడికల్ కాలేజీ, నర్సంపేట ఎడ్యుకేషన్ కేంద్రంగా మారుతున్న సమయంలో మహిళలు, విద్యార్థులు ధైర్యంగా సమస్యలను ఎదుర్కోవడానికి జిల్లా పోలీస్ శాఖ నర్సంపేటకు షీ టీం శాఖను కేటాయించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

సీపీఐ ఇల్లంద కార్యదర్శిగా భిక్షపతి



వర్ధన్నపేట : మండలంలోని ఇల్లంద భారత కమ్యూనిటీ పార్టీ (సీపీఐ) గ్రామ కార్యదర్శిగా గొడిశాల భిక్షపతి ఎన్నికైనట్లు పార్టీ మండల కార్యదర్శి ఆరెల్లి రవి, సహాయ కార్యదర్శి కడమంచి యాదగిరి తెలిపారు. సోమవారం గ్రామంలో నిర్వహించిన పార్టీ గ్రామసభలో నూతన కమిటీని ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు. సహాయ కార్యదర్శులుగా పిల్లల సదానందం, ఆవునూరి సదానందం, కౌన్సిల్ సభ్యులు, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నట్లు వివరించారు. సమావేశంలో పార్టీ సభ్యులు పొన్నాల సారయ్య, సాయిలు, యాకయ్య పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల పరిశీలన


రేకంపల్లిలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ అరుంధతి

దుగ్గొండి: మండలంలోని రేకంపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లను ఎంపీడీఓ లెక్కల అరుంధతి మంగళవారం పరిశీలించారు. గ్రామంలో ఎన్ని ఇళ్లు మంజూరయ్యాయి. ఎంత మంది ఇంటి నిర్మాణ పనులు ప్రారంభించారు. బెడ్‌లెవల్, స్లాబ్ లెవల్ ఇళ్లు ఎన్ని అనే వివరాలను స్వయంగా పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పైలెట్ ప్రాజెక్టులో భాగంగా గ్రామంలో మరో 45 మందికి ఇళ్లు మంజూరయ్యే అవకాశం ఉందన్నారు. ఆమె వెంట పంచాయతీ కార్యదర్శి అశోక్‌రెడ్డి, కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఒలిగె నర్సింగరావు, తదితరులు ఉన్నారు.

యూరియా కోసం ఎదురుచూపులు

- అధికారుల అంచనాలు తారుమారు
- పెరిగిన మొక్కజొన్న, పత్తి సాగు విస్తీర్ణం
- ఎరువులు కేటాయించకపోతే ఇబ్బందే..


పీఏసీఎస్ కార్యాలయం వద్ద యూరియా కోసం చెప్పులు లైన్‌లో పెట్టిన రైతులు


టోకెన్ కోసం రైతువేదిక వద్ద క్యూలో నిల్చున్న రైతులు

నల్లబెల్లి : మండలంలో గతేడాది మండలంలో 11 వేల ఎకరాల్లో రైతులు పత్తి, మొక్కజొన్న పంటలు సాగుచేయగా.. పంట మార్పిడి విధానంపై శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు రైతులకు అవగాహన కల్పించడంతో ఈ యేడాది 13 వేల ఎకరాలకు చేరింది. దీంతో ఈ యేడాది పంటల సాగు ముందుగా చేస్తున్నారు. వర్షాలు కురుస్తుండడంతో రైతులు యూరియాకు ఎగబడుతున్న పరిస్థితి మండలంలో నెలకొంది. అందుకు అనుగుణంగా యూరియా కేటాయింపులు పెంచాల్సి ఉంది.

మండలంలో మొక్కజొన్న సాగు విషయంలో అధికారుల అంచనాలు తారుమారయ్యాయి. గతేడాది రైతులు సాగు చేసిన పంటల విస్తీర్ణం మేరకు ఎరువుల అంచనాలు పంపించారు. కానీ అనూహ్యంగా ఈసారి మొక్కజొన్న సాగు పెరిగింది. మిరప తోటలు వైరస్, వేరుకుళ్లు వంటి తెగులు పంటలకు సోకడంతో పంట నష్టపోవడం ఓ కారణమైతే ముందస్తుగా వర్షాలు రావడంతో రైతులు మొక్కజొన్న వైపు మొగ్గుచూపారు. వర్షాలు కురుస్తుండడంతో మొక్కజొన్న, పత్తితో పాటు కొద్దిపాటిగా వేసిన వరి పంటల కోసం యూరియా లొల్లి కొనసాగుతోంది. నల్లబెల్లి పీఏసీఎస్, శనిగరం రైతు ఆగ్రోస్ కేంద్రాల వద్ద రైతులు లైన్‌లో నిలబడి వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. మంగళవారం నల్లబెల్లి పీఏసీఎస్ కార్యాలయానికి రైతులు తెల్ల వారక ముందే చేరుకున్నారు. లైన్‌లో నిలబడలేక చెప్పులు, వాటర్ బాటిళ్లతో పాటు ఇతర వస్తువులను లైన్‌లో ఉంచి వేచి ఉన్నారు. విషయం తెలుసుకున్న అధికారులు రైతులను నల్లబెల్లి రైతు వేదిక వద్దకు తరలించారు. క్లస్టర్ల వారీగా మూడు కౌంటర్లు ఏర్పాటు చేసి టోకెన్లు అందించారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో మొక్కజొన్న 2500 ఎకరాలు, పత్తి 10 వేల ఎకరాలు, వరి 9 వేల ఎకరాల్లో రైతులు పంటలు సాగు చేస్తారని వ్యవసాయ అధికారులు అంచనా వేశారు. ఈ పంటల సాగు కోసం ఈ సీజన్‌లో 3,105 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉంటుంది. ఇప్పటి వరకు రైతులకు వెయ్యి మెట్రిక్ టన్నుల యూరియా అవసరముంటుంది. కానీ మండలానికి ఇప్పటి వరకు 650 మెట్రిక్ టన్నుల యూరియా మాత్రమే రాగా వాటిని రైతులకు అందిస్తున్నారు. ఇంకా సుమారు 350 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం కానుంది. ఇందుకు అవసరమైన ప్రతిపాదనలు పంపించారు. ఒకటి, రెండు రోజుల్లో రైతులకు అవసరమైన యూరియాను అందిస్తామని అధికారులు చెబుతున్నారు.

ఇబ్బందులు లేకుండా చూస్తాం



రైతులకు అవసరమైన మేరకు యూరియా అందిస్తాం. అందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం. ఒకటి, రెండు రోజుల్లో రైతులకు అవసరమైన మేరకు యూరియా తెప్పిస్తాం. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

– బన్న రజిత, ఏఓ, నల్లబెల్లి

బోగస్ హామీలతో మోసపోయిన ప్రజలు

- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

రాయపర్తి : కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన బోగస్ హామీలతో ప్రజలు మోసపోయినట్లు తెలుసుకున్నారని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ ముఖ్యకార్యకర్తలతో స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపు దిశగా ఎంపీటీసీ క్లస్టర్ల వారీగా సన్నాహక సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న దయాకర్‌రావు మాట్లాడుతూ తెలంగాణలో ఒక పెద్ద బ్లాక్‌మెయిలర్ చేతిలో ప్రభుత్వం నడవడం బాధాకరమన్నారు. వారం రోజుల్లో రైతులకు సాగునీరు ఇవ్వకపోతే పాదయాత్ర చేద్దాం అని సీఎం రేవంత్‌రెడ్డి ఇల్లును ముట్టడిద్దామని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో రాక్షస పాలన కొనసాగుతుందని సరైన పాలన లేదన్నారు. కేసీఆర్ దూరదృష్టితో పని చేయడం వల్లే రైతులు సుభిక్షంగా ఉన్నారన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్వేలన్నీ బీఆర్‌ఎస్ వైపే ఉన్నట్లు తెలిపారు. నమ్ముకున్న కార్యకర్తలకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. 80శాతం బీఆర్‌ఎస్‌పార్టీ గెలుపెందుతుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఆర్‌ఆర్ ఫౌండేషన్ చైర్మన్, బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు మూనావత్ నర్సింహానాయక్, మాజీ ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ రంగు కుమార్‌గౌడ్, పీఏసీఎస్‌చైర్మన్ రామచంద్రారెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి పూస మధు, ఎస్టీయూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సురేందర్‌రాథోడ్, తదితరులు పాల్గొన్నారు. అనంతరం మండలంలోని జింకురాంతండాకు చెందిన మాజీ ఎంపీటీసీ బానోతు శ్వేతసుభాష్, మాజీ వార్డుమెంబర్ భీమా, మాలోతు రవి, మాలోతు బోజ్యా, మాలోతు లక్ష్మణ్, కాంగ్రెస్ నుంచి బీఆర్‌ఎస్‌లో చేరగా వారికి బీఆర్‌ఎస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

వివేకానందుడి సాహిత్యం చదవాలి



మాట్లాడుతున్న స్వామి తత్వదానంద మహరాజ్

పర్వతగిరి : విద్యార్థులు వివేకానందుడి సాహిత్యం చదివి సమాజంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని హైదరాబాద్‌లోని రామకృష్ణ మట్ స్వామి తత్వదానంద మహరాజ్, సూర్యప్రకాశ్‌లు అన్నారు. పర్వతగిరి శ్రీరామకృష్ణ సేవాసమితి, కల్లెడ స్వయం సేవిక బృందం ఆధ్వర్యంలో ఆర్‌డీఎఫ్ వనిత అచ్యుతపాయి విద్యాలయంలో మంగళవారం విద్యార్థినుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శారదామాత గొప్పతనాన్ని విద్యార్థులకు వివరించారు. ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటున్న ప్రస్తుత సోషల్ మీడియా సమాజంలో శ్రీశారదాదేవి, స్వామి వివేకానందుల జీవితాలను ఆదర్శంగా తీసుకొని వారి స్ఫూర్తిదాయకమైన సాహిత్యాన్ని ప్రతీ రోజు కొంత సమయం వెచ్చించాలన్నారు. సైన్స్ అండ్ టెక్నాలజీ అభివృద్ధి చెందుతున్న తరుణంలో లక్షలాది మందికి నైతిక అంశాలలో శిక్షణ ఇస్తున్న హైదరాబాద్ రామకృష్ణ మఠంలోని వివేకానంద ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యూమన్ ఎక్సెలెన్స్ వివేకానంద మానవ ప్రతిభా కేంద్రం నిర్వహిస్తున్న వివిధ శిక్షణ తరగతులను ఆన్‌లైన్ ద్వారా శిక్షణ పొందవచ్చన్నారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌డీఎఫ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆడెపు జనార్దన్, కల్లెడ రూరల్ స్కూల్ హెచ్‌ఎం కె.శ్రీనివాస్, రామకృష్ణ సేవా సమితి జాయింట్ సెక్రటరీ వడ్లకొండ దయాకర్, వైస్ ప్రిన్సిపాల్ ఏ.రాజు, అకడమిక్ హెడ్ ప్రవీణ్‌కుమార్, ఏఓ సతీష్, పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

- పర్వతగిరి సీఐ రాజగోపాల్


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సీఐ రాజగోపాల్

సంగెం : ప్రజలు గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని పర్వతగిరి సీఐ రాజగోపాల్ సూచించారు. మంగళవారం మండలంలోని కాపులకనిపర్తిలో సైబర్ క్రైమ్స్, డ్రగ్స్‌పై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత ఎక్కువగా గంజాయి మత్తుకు అలవాటు పడుతున్నారని తల్లిదండ్రులు వారి పిల్లలపై నిఘా ఉంచాలన్నారు. సైబర్ నేరాగాళ్లు వివిధ పద్ధతుల్లో బురిడి కొట్టిస్తున్నారని వారి బారిన పడకుండా జాగ్రత్త పడాలన్నారు. ఎవరైనా సైబర్ వారి వలలో పడి డబ్బులు పోగొట్టుకుంటే వెంటనే 1930 నంబర్‌కు తెలియజేయాలన్నారు. గ్రామాల్లో ఎవరైనా అనుమానితులు కన్పిస్తే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు, పోలీస్‌సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న వైనాల అశోక్

నల్లబెల్లి: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం ప్రతీ కార్యకర్త కృషి చేయాలని పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ వైనాల అశోక్ అన్నారు. మంగళవారం మండలంలోని నారక్కపేటలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజాపాలనలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని కోరారు. కష్టపడి పనిచేసే కార్యకర్తలకు తగిన గుర్తింపు ఉంటుందన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నారక్కపేట అధ్యక్షుడు శ్రీపతి సుమన్, నాయకులు పోగుల కుమారస్వామి, రాజు, యోగేశ్వర్, రమేష్, రాజకొంరయ్య, శోభన్, కుమార్, రాయసాబ్, శ్రీనివాస్, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

యూరియా కొరత లేకుండా చర్యలు


రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్ రాజ్‌కుమార్

సంగెం : యూరియా కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తహసీల్దార్ గనిపాక రాజ్‌కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని చింతలపల్లి, ఎల్గూర్‌రంగంపేట సొసైటీల్లో యూరియా పంపిణీని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూరియా దశలవారీగా సరఫరా అవుతుందని రైతులు అవసరం ఉన్న మేరకే తీసుకోవాలన్నారు. మోతాదుకు మించి యూరియా వాడకం వల్ల భూసారం దెబ్బతింటున్నదని శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారుల సూచనల మేరకే యూరియాను వాడాలన్నారు. నానో యూరియా, నానో డీఏపీలను ప్రత్యామ్నాయంగా వాడుకోవాలని సూచించారు. రైతులకు ఎరువుల పంపిణీ కార్డుల ద్వారా చేస్తారని ఏ సొసైటీ పరిధిలోని వారు అక్కడే తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ కార్తీక్, రైతులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ కానిస్టేబుల్‌పై చర్య తీసుకోవాలి


నిరసన వ్యక్తం చేస్తున్న బాధిత కుటుంబ సభ్యులతో చర్చిస్తున్న తహసీల్దార్ కృష్ణ

నల్లబెల్లి: తల్లిని మోసగించిన ఎక్సైజ్ కానిస్టేబుల్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బాధిత కుటుంబ సభ్యులతో కలిసి ఎమ్మార్పీఎస్ నాయకులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ నాయకులు పరికి కోర్నెల్, శనిగరం అరుణ్ మాట్లాడుతూ రుద్రగూడెం గ్రామానికి చెందిన వృద్ధురాలు లద్దునూరి సూరమ్మకు ఎకరం 10 గుంటల భూమి ఉందన్నారు. ఈ భూమిపై కన్నేసిన సూరమ్మ రెండో కుమారుడు గూడూరులో ఎక్సైజ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న యుగేందర్ మాయమాటలు చెప్పి మోసగిస్తూ తహసీల్దార్ కార్యాలయానికి తీసుకొచ్చి అతని భార్య ప్రపూర్ణపై ఎకరం 10 గుంటల భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారని ఆరోపించారు. అక్రమ పట్టాను రద్దు చేస్తూ వృద్ధురాలికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ కృష్ణ, బాధిత కుటుంబ సభ్యులు, ఎమ్మార్పీఎస్ నాయకులతో చర్చించారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసువెళ్లి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. నిరసనలో బాధిత కుటుంబ సభ్యులు, ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలి


నెక్కొండ: విద్యార్థులతో కలిసి మొక్క నాటుతున్న ఉపాధ్యాయులు


నర్సంపేట రూరల్: పాఠశాలలో మొక్కలు నాటుతున్న పంచాయతీ కార్యదర్శి మహేష్

నెక్కొండ : మొక్కలు పెంచి పర్యావరణ పరిరక్షణకు అందరూ పాటుపడాలని హెడ్‌మాస్టర్ సుధాకర్ అన్నారు. మండలంలోని అప్పల్‌రావుపేట ప్రాథమిక పాఠశాలలో మంగళవారం వన మహోత్సవంలో భాగంగా ఉపాధ్యాయులు విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ ఖాళీ ప్రదేశాల్లో, చెట్ల గట్లపై ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లో మొక్కలు నాటాలన్నారు.

చెట్లను పెంచి పర్యావరణాన్ని కాపాడుదాం

నర్సంపేట రూరల్ : చెట్లను పెంచి పర్యావరణాన్ని కాపాడుదామని పంచాయతీ కార్యదర్శి మహేష్ అన్నారు. మండలంలోని కమ్మపల్లి ప్రాథమిక పాఠశాలలో మంగళవారం వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో కలిసి మొక్కలను నాటారు. ఈ సందర్భంగా కార్యదర్శి మహేష్ మాట్లాడుతూ మొక్కలు నాటి భవిష్యత్ కాలంలో వాతావరణ కాలుష్య నివారణకు తోడ్పాడును అందించి భవిష్యత్ కాలానికి నాంది కావాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఎస్‌కే సర్దార్, కారోబార్‌లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పొదల మాటున ప్రమాదకర ప్రయాణం


సబ్‌స్టేషన్ సమీపంలో నల్లబెల్లి-దుగ్గొండి ప్రధాన రహదారిపై అల్లుకున్న ముళ్లపొదలు

దుగ్గొండి: మండల కేంద్రం నుంచి నల్లబెల్లికి వెళ్లే ప్రధాన రహదారి దుగ్గొండి సబ్‌స్టేషన్ సమీపంలో 100 మీటర్ల వరకు ముళ్లపొదలతో నిండిపోయింది. అటు నుంచి ఏ వాహనం వస్తుందో ఇటునుంచి వెళ్లే వారికి కనబడకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రధాన రహదారిపై అల్లుకున్న ముళ్ల పొదలను తొలగించడంలో ఆర్‌అండ్‌బీ, పంచాయతీ రాజ్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రోడ్డుపై అల్లుకున్న పొదలను తొలగించాలని వారు కోరుతున్నారు.

చేయూత

రాయపర్తి : స్థానిక ప్రభుత్వ పాఠశాలకు చెందిన మద్రి రక్షిత ట్రిపుల్ ఐటీ బాసరలో సీటు సాధించగా ఆ విద్యార్థినిని మంగళవారం ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్, బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి సన్మానించారు. అనంతరం రూ.5వేల ఆర్థికసాయం అందించి అభినందించారు. అనంతరం పల్లెబాట కార్యక్రమంలో భాగంగా గడపగడపకు బీఆర్‌ఎస్ కార్యక్రమాన్ని మహబూబ్‌నగర్, పన్యానాయక్‌తండాల్లో నిర్వహించి పలు ఇబ్బందులతో ఇబ్బంది పడుతున్న బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం అందించారు. మైలారం గ్రామానికి చెందిన పిట్టల రామచంద్రు ఇటీవల మృతిచెందగా బాధిత కుటుంబానికి 100కేజీల బియ్యం, ఆయిల్ క్యాన్‌ను అందించారు.

బాధిత కుటుంబానికి బియ్యం అందజేత

ఇటీవల మృతి చెందిన మండలంలోని ఊకల్ గ్రామానికి చెందిన బాలగాని యాదగిరి కుటుంబాన్ని కాంగ్రెస్ నాయకుడు పాల శ్రీనివాస్ మంగళవారం పరామర్శించారు. అనంతరం బాధిత కుటుంబానికి బియ్యం అందజేసినట్లు తెలిపారు. బాధిత కుటుంబాలకు గత పదేళ్లుగా బియ్యం, ఆర్థిక సాయం అందిస్తున్నట్లు తెలిపారు. దివ్యాంగుల సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

విద్యుదాఘాతంతో దుక్కిటెద్దు మృతి


మృతిచెందిన దుక్కిటెద్దు వద్ద తండావాసులు

రాయపర్తి: విద్యుదాఘాతంతో దుక్కిటెద్దు మృతి చెందిన సంఘటన మండలంలోని ఏకే తండాలో మంగళవారం చోటు చేసుకుంది. తండాకు చెందిన మూనావత్ బిచ్యాకు చెందిన దుక్కిటెద్దు వ్యవసాయ పంటపొలాల్లో మేత మేస్తుండగా విద్యుత్ స్తంభం వద్దకు రాగానే విద్యుదాఘాతానికి గురై మృతిచెందినట్లు తండావాసులు తెలిపారు. ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు కోరుతున్నాడు.

దాశరథిని ఆదర్శంగా తీసుకోవాలి


దాశరథి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

పర్వతగిరి : విద్యార్థులు దాశరథిని ఆదర్శంగా తీసుకొని చదువులో రాణించాలని హెచ్‌ఎం పాక రమేశ్‌బాబు అన్నారు. మండల కేంద్రంలోని హైస్కూల్‌లో దాశరథి శతజయంతి వేడుకలను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదువుకొని ఉజ్వల భవిష్యత్ దిశగా సాగాలని సూచించారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో ఇంటర్ విద్యార్థిని మృతి

నర్సంపేట : అనారోగ్యంతో ఇంటర్ విద్యార్థిని మృతి చెందిన సంఘటన చెన్నారావుపేట మండలం గుర్రాలగండి శివారు రాజపల్లెలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... గ్రామానికి చెందిన గజ్జెల అశోక్ కూతురు తేజ(17) హనుమకొండలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ ఫస్టియర్ హాస్టల్లో ఉంటూ చదువుతోంది. పది రోజుల క్రితం ఆరోగ్యం బాగా లేకపోవడంతో హాస్టల్ నిర్వాహకులు తన తండ్రి అశోక్‌కు సమాచారం అందించడంతో ఇంటికి తీసుకొచ్చాడు. తీవ్ర జ్వరం, ఫిట్స్ రావడంతో నర్సంపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయించాడు. అయినా నయం కాకపోవడంతో ఈనెల 21న ఎంజీఎం ఆస్పత్రిలో చేర్పించాడు. ఎంజీఎంలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి తండ్రి అశోక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజేష్‌రెడ్డి తెలిపారు.

కాట్రపల్లి మాజీ సర్పంచ్ మృతి


భిక్షపతి (ఫైల్)

రాయపర్తి: అనారోగ్యంతో మండలంలోని కాట్రపల్లి మాజీ సర్పంచ్ కందుకూరి భిక్షపతి మంగళవారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తెలిపారు. 2000–2005 సంవత్సరం వరకు సర్పంచ్‌గా సేవలందించినట్లు తెలిపారు. కొంత కాలంగా తీవ్ర అనారోగ్య సమస్యతో ఎంజీఎంలో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన గ్రామానికి అందించిన సేవలను గ్రామస్తులు గుర్తు చేసుకున్నారు.

ముగ్గురు నిందితుల అరెస్ట్

పర్వతగిరి: మండలంలోని రోళ్లకల్ గ్రామానికి చెందిన నాళ్లం మూర్తి మృతికి కారకులైన జనగాం సమ్మయ్య, పెద్ద మనుషులు రాములు, మంగ్యలను అరెస్ట్ చేసి మంగళవారం కోర్టులో హాజరుపర్చినట్లు ఎస్సై బి.ప్రవీణ్ తెలిపారు. మూర్తి తాత మల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టి ముగ్గురిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చగా ఒకరు పరారీలో ఉన్నట్లు తెలిపారు.

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి


జిమ్ సెంటర్‌కు ముగ్గు పోసి మాట్లాడుతున్న డిప్యూటీ తహసీల్దార్ హారతి

పర్వతగిరి: ప్రతీ ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని డిప్యూటీ తహసీల్దార్ హారతి అన్నారు. మండలంలోని వడ్లకొండ గ్రామంలో మంగళవారం జిమ్ సెంటర్‌కు ముగ్గు పోశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మారుతున్న ప్రస్తుత కాలంలో ప్రతీ ఒక్కరూ జీవన విధానంలో మార్పులు తెచ్చుకోవాలన్నారు. తప్పకుండా వాకింగ్‌తో పాటు జిమ్ సెంటర్‌లను వినియోగించుకోవాలన్నారు. అనంతరం గ్రామపంచాయతీ సిబ్బందికి కాంగ్రెస్ నాయకుడు అత్తి కుమారస్వామి సొంత ఖర్చులతో కొనుగోలు చేసిన రెయిన్ కోట్స్ అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ యూత్ కమిటీ నాయకులకు సన్మానం


నర్సంపేట రూరల్ : మండల బీఆర్‌ఎస్ యూత్ కమిటీని ఇటీవల ఎన్నుకున్నారు. మంగళవారం గురిజాల గ్రామ బీఆర్‌ఎస్ కమిటీ ఆధ్వర్యంలో మండల యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ గురిజాల నుంచి ఎన్నికైన మాజీ ఉపసర్పంచ్ మచ్చిక హరీష్‌గౌడ్, అధికార ప్రతినిధి బూస శ్రీశైలం, యూత్ ప్రధాన కార్యదర్శి ఎన్నికైన సంగెం శ్రీకాంత్, యూత్ ఉపాధ్యక్షుడు గజ్జి శ్రీరాంలను శాలువా, పూలమాలలు వేసి సన్మానించారు.

విద్యార్థులకు నియామకపత్రాలు అందించాలి


సమావేశంలో మాట్లాడుతున్న బొట్ల నరేశ్

నర్సంపేట రూరల్ : బెస్ట్ అవైలబుల్ స్కీం ద్వారా ఎంపికైన విద్యార్థులకు నియామకపత్రాలు అందించాలని ఏబీఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బొట్ల నరేశ్ డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వరంగల్ జిల్లా పరిధిలో గిరిజన విద్యార్థులను గత నెలలో జిల్లాలోని వివిధ ప్రైవేట్ పాఠశాలలో ఒకటి నుంచి ఐదో తరగతిలో బెస్ట్ అవైలబుల్ స్కీం ద్వారా ఎంపిక చేశారన్నారు. కానీ ఇప్పటి వరకు ఎంపికైన విద్యార్థులకు నియామక పత్రాలను అందించలేదన్నారు. తక్షణమే అందించిన ఆయా పాఠశాలలకు పంపించాలని కోరారు. లేకపోతే విద్యార్థులు చదువులో దూరమయ్యే పరిస్థితి నెలకొందన్నారు. తక్షణమే ఆ విద్యార్థులు నియామకపత్రాలను అందించాలని డిమాండ్ చేశారు. మమత, కావ్య, శ్రీభవిత, సుకన్య, నవ్య, తదితరులు పాల్గొన్నారు.

సఖి సేవలపై మహిళలకు అవగాహన


అవగాహన కల్పిస్తున్న స్వప్న

రాయపర్తి: మండలకేంద్రంతో పాటు మండలంలోని మొరిపిరాలలో సఖి సెంటర్ సేవలపై మహిళలకు అవగాహన కల్పించినట్లు సఖి సెంటర్ కేసు వర్కర్‌లు తిరుమల, స్వప్న పేర్కొన్నారు. మంగళవారం సఖి సెంటర్ వరంగల్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు, బాలికల రక్షణ కోసం కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఈ సెంటర్‌లను నడిపిస్తున్నట్లు చెప్పారు. సమాజంలో మహిళలు, బాలికలు ఎదుర్కొంటున్న గృహహింస, బాల్య వివాహ నిరోధక, పోక్సో చట్టాలపై అవగాహన కల్పించినట్లు చెప్పారు.